క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): నిబంధనలు అతిక్రమించిన వాహన చోదకులపై చర్యలు తప్పవని గరివిడి ఎస్‌ఐ ఎల్.దామోదరరావు హెచ్చరించారు. చీపురుపల్లి–రాజాం ప్రధాన రహదారిలో కాపుశంబాం కూడలి వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేనివారిపై అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని సూచించారు.

పాఠశాలలకు చేరుకున్న 'విద్యాకానుకలు'



రామచంద్రాపురం ఉన్నత పాఠశాలకు చేరుకున్న విద్యాకానుక కిట్లు

దత్తిరాజేరు: మండలంలోని 6 ఉన్నత పాఠశాలలు, 42 ప్రాథమిక పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలకు జగనన్న విద్యాకాను కిట్లు చేరుకున్నాయని ఎంఈఓ వెంకటరావు శుక్రవారం తెలిపారు. వాటిని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేయడం జరిగిందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున వాటిని విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

రేపు 'వాక్ ఫర్ పీస్' ర్యాలీ

చీపురుపల్లి: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ యూత్ వింగ్, కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న 'వాక్ ఫర్ పీస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక బ్రహ్మకుమారీ సేవా కేంద్రం ఇన్‌చార్జి బీకే శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5.45 గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాడు–నేడు పనులు పూర్తి

దత్తిరాజేరు: దత్తి ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులు శతశాతం పూర్తిచేసినట్లు హెచ్ఎం ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగా తీర్చిదిద్దాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా రూ.40 లక్షలతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులను ఏర్పాటు చేశామన్నారు. తరగతి గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు, వంటగది, తదితర వాటిని నిర్మించినట్లు చెప్పారు.

మిగులు సీట్ల భర్తీకి 14న ప్రవేశ పరీక్ష

లక్కవరపుకోట: మహాత్మ జ్యోతీబాపూలే గురుకుల విద్యాలయాల్లో 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి ఈ నెల 14న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎల్.కోట పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల మండల కేంద్రంలోని జ్యోతీబాపూలే పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులలో ప్రశ్నలు ఉంటాయని, ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామంలో సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేదపండితుల వేదమంత్రోచ్చరణల మధ్య గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బిందెలతో గ్రామప్రదక్షిణ, జలాధివాసం, అగ్ని ప్రతిష్ట, మంత్ర పుష్పనీరాజనం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి గ్రామంలో ఉన్న ఉమామహేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు.

బిర్సాముండా వర్ధంతి

శృంగవరపుకోట: ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసిన బిర్సా ముండా 123వ వర్ధంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ వాళ్ల నిరంకుశ పాలన, ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన పోరాటాల నుంచి యువత స్ఫూర్తి పొందాలని, ఆయన ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

జగనన్న పాలనలో గడపగడపకూ సంక్షేమం

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,
ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: రాష్ట్రంలోని ప్రతీ గడపకు సంక్షేమాన్ని చేరువచేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సచివాలయం–2 పరిధిలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అవినీతికి తావులేకుండా గ్రామ సచివాలయాలు, గ్రామ వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేరవేస్తున్నామన్నారు. కుల, మత, వర్గ బేధాలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. నాలుగేళ్లలో చీపురుపల్లి సచివాలయం–2 పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం రూ.13 కోట్లు అందించిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ అబద్ధపు మాటలతో పచ్చటోపీలు పెట్టడానికి చంద్రబాబునాయుడు వస్తున్నాడని, పొరపాటను నమ్మితే ప్రజలకే నష్టం జరుగుతుందన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పరిపాలనలో ప్రజలను మోసం చేయడం తప్ప అభివృద్ధి, సంక్షేమం చేయలేదన్నారు. అనంతరం గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైస్ ఎంపీపీ పతివాడ లక్ష్మి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ బెవర ఉమ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, కోరుకొండ దాలయ్య, ఇప్పిలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

అర్హులందరికీ పథకాలు అందిస్తున్నాం..

● ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, లబ్ధిదారులకు పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రజలకు పాలనను చేరువ చేశారని, ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పెలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరాము నాయుడు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరి, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, మండల సచివాలయ కన్వీనర్ బోజంకి శ్రీను, పార్టీ నాయకులు గండి శ్రీరామ్మూర్తి నాయుడు, బీల సతీష్, దండు సత్తిబాబు గొటివాడ దేవీ, కోలా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



దబ్బిరాజుపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



వృద్ధుని యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



బొద్దాంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

వేపాడ: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి పీఎస్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బొద్దాం వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో హౌసింగ్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అధికారుల బృందం కాలనీలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. రుణాలు కావాల్సిన వారికి ఐకేపీ ద్వారా రూ.35 వేలు రుణం మంజూరు చేస్తామన్నారు. అనంతరం ముకుందపురంలో ఇళ్ల స్థలాలను పరిశీలించారు. జెడ్పీ గ్రాంట్స్ రూ.5 లక్షలతో లెవెలింగ్ పనులు పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు సన్యాసినాయుడు, విద్యుత్‌శాఖ ఏఈ సూరిబాబు, ఐకేపీ ఏపీఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.15 కోట్ల రుణాలు అందజేత



మహిళలకు చెక్కును అందచేస్తున్న బ్యాంకు మేనేజరు శ్రీభట్

బొండపల్లి: స్వయం సహాయక సంఘాలకు అందచేస్తున్న బ్యాంకు రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజరు శ్రీ భట్ అన్నారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళా సంఘాలతో పాటు వివిధ పథకాల కింద రుణాలు మంజూరైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.15కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రుణాలు పొందిన లబ్ధిదారులు వారి వ్యాపారాలను వృద్ధి చేసుకుని ఆదాయం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ ప్రభు, సహాయ జనరల్ మేనేజర్ సుధాకర్, బ్యాంకు రీజనల్ మేనేజర్ నరేష్, పి.వి.మల్లేశ్వరరావు, మాధూరి, శ్రీనివాస్, చైతన్య, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష రేపు

లక్కవరపుకోట, కొత్తవలస: ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాళ్లు పి.శివప్రసాద్, కె.ధర్మకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస ఆదర్శ పాఠశాలలో వంద సీట్లు అందుబాటులో ఉండగా 304 దరఖాస్తులు, లక్కవరపుకోట ఆదర్శ పాఠశాలలో వంద సీట్లకు గాను 206 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలి



కొత్తవలస: గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



జామి: గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న డాక్టర్ భాగ్యరేఖ



దత్తిరాజేరు: గర్భిణులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి ప్రవంతి

కొత్తవలస: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవాలు చేయించుకునేలా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వారికి అవగాహన కల్పించాలని వియ్యంపేట పీహెచ్‌సీ డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం 62 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. 22 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. పాలు, గుడ్లు, బెల్లంతో చేసిన పప్పు చెక్కీలు, ఆకుకూరలను ఆహారంతో తీసుకోవాలని సూచించారు. ఐరన్, కాల్షియం, బీకాంప్లెక్స్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంహాద్రినాయుడు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

దత్తిరాజేరు: పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కె.కొత్తవలస వైద్యాధికారి ప్రవంతి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 15 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని, చిన్నచిన్న పనులు చేయడం ద్వారా ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఆకుకూరలు, పాలు, కూరగాయలు ఎక్కువగా తినాలని సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

జామి: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన గర్భిణులకు స్టేట్ బ్యాంక్ ఉద్యోగి కాకర శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు. వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డాక్టర్ భాగ్యరేఖ గర్భిణులకు భోజనాలు వడ్డించారు.

షటిల్ టోర్నీ విజేత వెంకటరాజుపాలెం



ఉత్సాహంగా జరుగుతున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

జామి: మండలంలోని వీఆర్‌పాలెం గ్రామంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 23 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో వెంకటరాజుపాలెం జట్టు(పి.హరీష్, గణేష్), ద్వితీయ స్థానంలో వీఆర్ పాలెం జట్టు(బి.అర్జున్, జె.వెంకటరావు), తృతీయ స్థానంలో పెదవేమలి జట్టు (ఎస్.అప్పలసత్యం, రవి) నిలిచాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకం అందజేవారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

బొండపల్లి: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న జగనన్న గృహాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీకే దుర్గాప్రసాద్, తహసీల్దార్ డీఎస్‌జీఎస్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుర్ల: మండలంలోని గొల్లలపేట అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), వల్లాపురం మినీ అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ) పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నెల్లిమర్ల సీడీపీఓ ఆరుద్ర శుక్రవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా ఉంటున్న మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 22లోగా నెల్లిమర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

గజపతినగరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసినట్లు లైబ్రేరియన్ వై.స్వప్న తెలిపారు. చివరిరోజు శిబిరంలో 40 మంది విద్యార్థులు పాల్గొనగా.. వారికి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మోటార్ సైకిల్ చోరీపై కేసు నమోదు

కొత్తవలస: ఇంటి వద్ద నిలిపి ఉంచిన తన పల్సర్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని మండల కేంద్రంలోని సబ్బవరం రోడ్డులో నూకాలమ్మ గుడి సమీపంలో ఉంటున్న కోనేటి సాయిశివ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏపీ 39 జీడబ్ల్యూ 9890 ఊదారంగు బైక్ చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు

● ఎంపీపీ హైమావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను అందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. విత్తనాల మొలక శాతం బాగుంటేనే వాటిని రైతులకు అందించాలన్నారు. అలాగే రైతుఉత్పత్తి సంఘాలకు రాయితీపై యంత్ర పరికరాలు అందించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రంధి రాము, ఏఓ బి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

విత్తనాల కొరత లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణ

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు వరి విత్తనాలు కొరత లేకుండా చూడాలని, ముందస్తుగా విత్తనాలు తెప్పించి ఆర్‌బీకేల్లో నిల్వ చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. బొండపల్లి ఆర్‌బీకేలో శుక్రవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. రైతులుకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ పి.వి.మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, ఏఓఈ సంతోష్‌కుమార్, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ బండారు శ్రీను, సలహా మండలి సభ్యులు కోరాడ సత్యనారాయణ, సుంకరి శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలను వినియోగించుకోండి



కొత్తవలస: మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి మాధురీశరణ్య

లక్కవరపుకోట: రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీహెచ్.మాధవరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలను సమకూర్చాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎ.స్వాతి కుమారి, పశువైద్యాధికారి గాయిత్రీదేవి, గంగుబూడి సర్పంచ్ జి.హరిప్రసాద్, కొట్యాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ 1వ సచివాయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాధురిశరణ్య మాట్లాడుతూ.. ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని కోరారు.

ముందస్తుగా విత్తనాలు అందించాలి



గుర్ల: సమావేశంలో మాట్లాడుతున్న పొట్నూరు సన్యాసినాయుడు

గుర్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులందరికీ వరి విత్తనాలు అందించాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందని వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు, మండల అగ్రికల్చరల్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముద్దాడ కేశవరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌కు సంబంధించి రైతుల అవసరాలు, విత్తనాలు, ఎరువులు, సాగునీటి వసతులపై చర్చించారు. రైతులకు సాగులో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అగ్రికల్చరల్ అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ కెంగువ మధుసూదనరావు, ఏఓ తిరుపతిరావు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై డ్రోన్స్



జామి: మాట్లాడుతున్న ఏఓ కిరణ్‌కుమార్

జామి: వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వార ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేసేందుకు అధునాతన డ్రోన్లను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తోందని వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం వివరాలను వెల్లడించారు. రైతు తన వాటాగా 10 శాతం చెల్లిస్తే, ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుందని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. డ్రోన్ వినియోగంపై నిరుద్యోగ యువతకు గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (లాం ఫారం)లో శిక్షన ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న రైతులు దరాఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల రమణబాబు, సభ్యులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● మండల ప్రత్యేకాధికారి పి.రమేష్



రికార్డులను తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి

గజపతినగరం: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి పి.రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ధనలక్ష్మి, ఐసీడీఎస్ పీఓ పి.నాగమణి, సూపర్‌వైజర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

అంతర్ముఖ యోగలో ఉచిత శిక్షణ రేపు

గజపతినగరం: పట్టణంలోని ఆల్తివారి కూర్మ గణపతి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 11న అంతర్ముఖ యోగాలో ఉచిత శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు యోగా శిక్షకులు శీరవాసు శుక్రవారం తెలిపారు. నేటి సమాజంలో మానవులందరూ సంపూర్ణ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆధ్యాత్మిక గురువు భిక్షయ్య ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరాన్ని పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.